తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలకు ఈ స్థలాలలో ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. తెలంగాణ ఉద్యమ అమరుల కుటుంబాల సంక్షేమం కోసం సర్వే నంబర్ 325 భూమిలో ప్రత్యేకంగా అమరవీరుల కాలనీ నిర్మాణం చేయాలని ఆదేశించారు. అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి అన్ని వసతులతో కూడిన అందమైన కాలనీని నిర్మించాలని స్పష్టం చేశారు. ఈ కాలనీ నిర్మాణానికి సంబంధించిన పూర్తి బాధ్యతలను రాష్ట్ర హౌసింగ్ బోర్డు అధికారులకు అప్పగించారు. పేద కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సకల సౌకర్యాలతో కూడిన మౌలిక వసతులు కల్పించాలి. అమరవీరుల కాలనీ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వచ్చే జూన్ రెండో తేదీలోగా అమరవీరుల కాలనీ నిర్మాణం పూర్తి కావాలని ముఖ్యమంత్రి అధికారులను హెచ్చరించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మరోసారి స్పష్టం చేశారు. నిరుపేద కుటుంబాల కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. భూముల ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. స్థానిక ప్రజలు సైతం ఈ సర్వే ప్రక్రియకు పూర్తి స్థాయిలో సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పరంగా తీసుకుంటున్న ఈ కీలక నిర్ణయాల వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుంది. కాలనీ నిర్మాణ పనుల పురోగతిని ప్రతి వారం సమీక్షించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ మొత్తం వ్యవహారంలో పారదర్శకత కోసమే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వేగంగా అడుగులు వేస్తోంది. ప్రజాధనం మరియు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నారు. తప్పు చేసిన ఎవరినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ప్రభుత్వ వర్గాలు తేల్చిచెప్పాయి. ఎర్రవల్లి గ్రామ ప్రజలు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. స్థానిక యువతకు ఈ అంశంపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని స్థానికులు భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల అమరవీరుల కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నిర్ణీత తేదీ నాటికి పనులు పూర్తి కావాలని అందరూ కోరుకుంటున్నారు. రెవెన్యూ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారు. సరికొత్త మార్పులతో ఈ ప్రాంతం త్వరలోనే మరింత అభివృద్ధి చెందడం ఖాయంగా కనిపిస్తోంది.

# విమాన ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ ఊరట

- పుష్పక్ బస్సు ఛార్జీల్లో 40 శాతం వరకు తగ్గింపు

**సైబరాబాద్ - విశాల భారతి**

విమాన ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఊరటనిచ్చింది. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి నడిచే పుష్పక్ ఏసీ విద్యుత్ బస్సుల ఛార్జీలను 40 శాతం వరకు తగ్గించింది. మియాపూర్ నుంచి విమానాశ్రయానికి రూ.350 నుంచి రూ.250కు, జేఎన్‌టీయూ నుంచి రూ.350 నుంచి రూ.200కు, శిల్పారామం నుంచి రూ.300 నుంచి రూ.200కు, గచ్చిబౌలి నుంచి రూ.300 నుంచి రూ.150కు ఛార్జీలను తగ్గించారు. లింగంపల్లి, కొండాపూర్, కొత్తగూడ, ఆల్విన్ ఎక్స్ రోడ్స్ మార్గాల్లోనూ తగ్గింపు ఛార్జీలు అమలు చేయనున్నట్లు టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది.




# చిట్టీల ముసుగులో భారీ వసూళ్లు

- డబ్బులు చెల్లించకుండా మోసం
- బల్లి సురేందర్‌పై నార్సింగి పోలీసుల విచారణ

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

చిట్టీలు, అప్పుల పేరుతో పలువురి వద్ద భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి తిరిగి చెల్లించకుండా మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బల్లి సురేందర్ అలియాస్ సూరిపై నార్సింగి పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు ముంగి అమరేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఫిర్యాదు ప్రకారం.. బల్లి సురేందర్ తన వద్ద నుంచి రూ.20 లక్షలు అప్పుగా తీసుకున్నాడని, ఇందుకు భద్రతగా రూ.25 లక్షల విలువైన చెక్కును ఇచ్చినట్లు అమరేందర్ రెడ్డి పేర్కొన్నారు. అయితే తీసుకున్న అప్పును తిరిగి చెల్లించకపోవడంతో పాటు, చిట్టీల పేరుతో కూడా పలువురు వ్యక్తుల నుంచి క్రమం తప్పకుండా పెద్ద మొత్తంలో నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. చిట్టీలు పూర్తయిన అనంతరం సభ్యులకు చెల్లించాల్సిన మొత్తాలను ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విధంగా పలువురు వ్యక్తుల నుంచి కోట్ల రూపాయల మేర డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొనడంతో పోలీసులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఇప్పటివరకు అందిన ఫిర్యాదుతో పాటు మరికొందరి నుంచి కూడా సురేందర్ భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు సమాచారం ఉండటంతో పోలీసులు పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. బాధితుల సంఖ్య ఎంత, ఒక్కొక్కరి నుంచి ఎంత మొత్తం తీసుకున్నారు, చిట్టీల నిర్వహణ ఎలా జరిగింది, నగదు ఏ విధంగా వసూలు చేశారు, బ్యాంకు ఖాతాలు, యూపీఐ లావాదేవీలు, ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను పరిశీలించనున్నారు. అదేవిధంగా సురేందర్ తనపై ఉన్న ఆర్థిక బాధ్యతలకు సంబంధించి దివాలా పిటిషన్ దాఖలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొనడంతో, అందుకు సంబంధించిన పత్రాలను కూడా పోలీసులు పరిశీలించనున్నారు. వివిధ వ్యక్తుల నుంచి తీసుకున్న డబ్బుల వినియోగం, ఆర్థిక లావాదేవీలపై సమగ్రంగా విచారణ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం నార్సింగి పోలీసులు అందిన ఆరోపణలపై చట్టపరమైన ప్రక్రియ ప్రకారం విచారణ చేపడుతున్నారు. విచారణలో ఆరోపణలు నిజమని నిర్ధారణై, తగిన ఆధారాలు లభించినట్లయితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

**బాధితులు ఆధారాలతో సంప్రదించాలి**

సురేందర్ వద్ద చిట్టీలు, అప్పులు లేదా ఇతర ఆర్థిక లావాదేవీల ద్వారా డబ్బులు చెల్లించి తిరిగి పొందలేకపోయిన బాధితులు ముందుకు రావాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. తమ వద్ద ఉన్న రసీదులు, బ్యాంకు లావాదేవీల వివరాలు, యూపీఐ చెల్లింపుల ఆధారాలు, చిట్టీ పత్రాలు, వాట్సాప్ సందేశాలు, చెక్కులు తదితర ఆధారాలను తీసుకుని నార్సింగి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. దీంతో పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి, బాధితుల సంఖ్య మరియు ఆర్థిక నష్టం ఎంత అన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# గచ్చిబౌలి హాస్టల్‌లో టెక్కీ ఆత్మహత్య

**సైబరాబాద్ – విశాల భారతి**

గచ్చిబౌలిలోని ఆర్యా ఎలైట్ హాస్టల్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలిని ప్రకాశం జిల్లాకు చెందిన మండేలా మనీషా (28)గా పోలీసులు గుర్తించారు. ఆమె నానక్‌రామ్‌గూడలోని ఓ ఐటీ కంపెనీలో పనిచేస్తున్నది. డిప్రెషన్, ఒంటరితనం వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మనీషా రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



# ఏఐ సమ్మిట్‌లో హ్యూమనాయిడ్ రోబో ఆకట్టుకున్న సందడి



- విద్యార్థుల ఆవిష్కరణలు.. ఏఐ హ్యాకథాన్‌లో సాంకేతిక ప్రతిభ

**సైబరాబాద్ - విశాల భారతి**

కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ రంగాల్లో వస్తున్న ఆధునిక మార్పులను విద్యార్థులకు పరిచయం చేసే లక్ష్యంతో గచ్చిబౌలిలోని అరేనేషా ఏఐ హబ్ ఆధ్వర్యంలో 'ఏఐ ఎడ్యుకేషన్ సమ్మిట్-2026' నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు రూపొందించిన రోబోటిక్ నమూనాలు, ఏఐ ఆధారిత ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా యూనిట్రీ జీ1 హ్యూమనాయిడ్ రోబోట్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. మానవ ఆకృతిలో ఉండే రోబోట్ పనితీరును విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించగా, రోబోటిక్స్ సాంకేతికతలో చోటుచేసుకుంటున్న అభివృద్ధిపై నిర్వాహకులు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా నిర్వహించిన ప్రదర్శనల్లో పలువురు తమ సొంత ఆవిష్కరణలను ప్రదర్శించారు. సమ్మిట్‌లో భాగంగా విద్యార్థులకు రోజంతా ఏఐ హ్యాకథాన్ నిర్వహించి, వివిధ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను రూపొందించే అవకాశం కల్పించారు. పాల్గొన్న విద్యార్థులు తమ ఆలోచనలను ఏఐ ఆధారిత ప్రాజెక్టులుగా మలిచి న్యాయనిర్ణేతల ఎదుట ప్రదర్శించారు. ఈ సందర్భంగా అరేనేషా ఏఐ హబ్ వ్యవస్థాపకుడు, సీఈఓ నూతన్ మాట్లాడుతూ ఏఐను మనుషులకు ప్రత్యామ్నాయంగా కాకుండా పనులను సులభతరం చేసే సాంకేతికతగా చూడాలని సూచించారు. పునరావృతమయ్యే, శ్రమతో కూడిన పనులను రోబోట్లు నిర్వహించగలిగినా మానవ సృజనాత్మకత, ఆలోచనా సామర్థ్యానికి ప్రాధాన్యం కొనసాగుతుందని తెలిపారు. ఏఐతో పోటీ పడటం కంటే దానిని సమర్థంగా వినియోగించుకోవడం నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఇస్రో ప్రతినిధులతో పాటు పలువురు పారిశ్రామికవేత్తలు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

# మైనారిటీ స్కూల్‌పై కలెక్టర్ సీరియస్

- డైట్ మెనూ అమలులో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని స్పష్టీకరణ
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం.. స్వచ్ఛమైన నీరు. మెరుగైన వసతులు తప్పనిసరి
- డిజిటల్ విద్యతో విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టాలి
- మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతులు, భోజనం, పరిశుభ్రతపై జిల్లా కలెక్టర్ స్నేహా శబరిష్ ప్రత్యేక దృష్టి సారించారు. తొర్రూరు మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె.. పాఠశాల నిర్వహణలో ఎలాంటి లోపాలకు, నిర్లక్ష్యానికి తావివ్వొద్దని అధికారులకు స్పష్టం చేశారు. పాఠశాలలోని తరగతి గదులను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ విద్యాబోధన తీరును సమీక్షించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, భోజనం, డైట్ మెనూ, యూనిఫారాలు, నోట్‌బుక్స్ తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థుల అవసరాలు, సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. స్టోర్ గదిని తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడ నిల్వ చేసిన నిత్యావసర వస్తువుల నాణ్యత, గడువు తేదీలను పరిశీలించారు. స్టోర్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన డైట్ మెనూను అక్షరాలా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలతో వేడివేడిగా భోజనం అందించాలని స్పష్టం చేశారు. వంట సిబ్బంది ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయవద్దని, వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆహారం తయారీలో అన్ని జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్థితిగతులను కూడా ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపారు. అవసరమైన శిక్షణ, అవగాహన తరగతులను నిర్వహించి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. తరగతి గదుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, విద్యార్థులకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతన విద్యా విధానానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. డిజిటల్ తరగతులను సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రతి సబ్జెక్టులో విద్యార్థులకు పట్టు వచ్చేలా బోధన కొనసాగించాలని, ముఖ్యంగా ఇంగ్లిష్ భాషలో ప్రావీణ్యం సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తరగతులు నిర్వహించడంతో పాటు పరీక్షలు, నోట్స్ రాయించడం, యూనిఫారాలు అందించడం వంటి అంశాల్లో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

## కురవిలో దుర్గామాత నవరాత్రి వేడుకలకు ఘన ఆహ్వానం

- మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావుకు మర్యాదపూర్వక ఆహ్వానం



**కురవి విశాలభారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** కురవి మండల కేంద్రంలో ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్న దుర్గామాత దేవీ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి వేడుకల నిర్వాహక కమిటీ బాధ్యులు మంగళవారం బీచ్ రాజుపల్లిలోని గుడిపూడి నవీన్‌రావు స్వగృహానికి వెళ్లారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి నవరాత్రి ఉత్సవాలకు హాజరై విజయవంతం చేయాలని కోరుతూ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ, కార్యక్రమాల వివరాలను కమిటీ బాధ్యులు నవీన్‌రావుకు వివరించారు. నవరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పెద్దమడూరులో భారీ భూకబ్జా ఆరోపణలు




**దేవరుప్పుల విశాలభారతి:** జనగామ జిల్లా: దేవరుప్పుల మండలం పెద్దమడూరు గ్రామంలో ప్రభుత్వ, దేవాదాయ, అసైన్డ్, సీలింగ్ భూముల్లో భారీగా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఇటీవల దేవాదాయ శాఖ అధికారులు నిర్వహించిన సర్వేలో పలు భూముల విషయంలో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. దేవుడి మాన్యాలు, ప్రభుత్వ భూములు, గుట్టలు, ఖాళీ స్థలాలు, అసైన్డ్ భూములను కొందరు అక్రమంగా తమ పేర్లపైకి మార్చుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ పట్టాల ఆధారంగా ఏళ్ల తరబడి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత అధికారుల పాత్రపై అనుమానాలు ఈ వ్యవహారంలో గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారుల పాత్రపైనా కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల సహకారం లేకుండా ప్రభుత్వ, దేవాదాయ భూముల వ్యక్తుల పేర్లపైకి ఎలా మారాయనే ప్రశ్నలు గ్రామస్తులు లేవనెత్తుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు. దొంగ పట్టాలు రద్దు చేయాలి. అక్రమంగా జరిగిన భూ బదలాయింపులను గుర్తించి పట్టాలను రద్దు చేయాలని, ప్రభుత్వ, దేవాదాయ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వ్యక్తులతో పాటు బాధ్యులైన అధికారులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## దసరా సందర్భంగా ముందస్తు పరిశీలన



**విశాలభారతి, గూడూరు:** గూడూరు మండల కేంద్రంలో గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు హిందూ ఉత్సవ సమితి* ఆధ్వర్యంలో జరగబోయే అతిపెద్ద దసరా పండుగ రావణాసుర వద. రామలీల మైదానం నీ సందర్శించిన గూడూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ ఉపసర్పంచ్ చంటి స్వామి .వారితోపాటు మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిట్ వెంకన్న. గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి. హిందూ ఉత్సవ సమితి కమిటీ అధ్యక్షులు పింగిలి శ్రీనివాస్. గూడూరు గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు టౌన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు.

## ఘనంగా ఎమ్మెల్యే మురళి నాయక్ జన్మదిన వేడుకలు



**విశాలభారతి, గూడూరు:** గూడూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి సర్పంచ్ మాట్లాడుతూ నిరంతరం ప్రజా సంక్షేమం, మానుకోట నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న డాక్టర్ భూక్య మురళి నాయక్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భగవంతుడు వారికి మరింత శక్తిని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిట్టా వెంకన్న. గూడూర్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి గూడూరు ఉపసర్పంచ్ చంటి స్వామి. బొల్లెపల్లి సర్పంచ్ బానోతు మహేష్. మరి మిట్ట సర్పంచ్ పూర్ణచందర్. దామరవంచ సర్పంచ్. సనప సుజాత సుదర్శన్. లైన్ తండా ఉపసర్పంచ్ అజ్మీర రవి. భూపతి పేట ఉపసర్పంచ్. కుందారపు వెంకటేశ్వర్లు. నాయకపల్లి ఉప సర్పంచ్ గోగుల కుమారస్వామి. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిశెట్టి శ్రీను. నాయకపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు కదారి శ్రీను. లైన్ తండా గ్రామ పార్టీ అధ్యక్షులు మాన్సింగ్. చిన్న ఎల్లాపురం ఉపసర్పంచ్ వెంకట్ రాము. గూడూరు మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గం. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వార్డు మెంబర్లు యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం




**చౌటుప్పల్,విశాల భారతి:** మండలంలోని దామెర, మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లసింగారం గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం దివిస్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. దామెర ఉప సర్పంచ్ ఉప్పునూతల నరసింహ, చౌటుప్పల్ మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మి గారు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ జయంతి కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రూ.32,496 విలువ గల నోట్ పుస్తకాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె. విజయ కుమారి, కె. ప్రసన్నారాణి గారు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల అధ్యాపక బృందం, వైద్య సిబ్బంది, దివిస్ ప్రతినిధులు బి. గోపి, జి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యమే ఉపాధికి బాట

- శ్రీ చైతన్య పారామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఢిల్లీ శేఖర్ రెడ్డి



**చౌటుప్పల్,విశాల భారతి:** వృత్తి విద్యతో నైపుణ్యాలను పెంపొందించుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని శ్రీ చైతన్య అకాడమీ ఆఫ్ పారామెడికల్ టెక్నాలజీ కళాశాల కరెస్పాండెంట్ కం ప్రిన్సిపాల్ ఢిల్లీ శేఖర్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ లోని జయశ్రీ ఫంక్షన్ హాల్ లో సోమవారం కళాశాల స్వాగత వేడుకలను ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. పారామెడికల్ రంగంలో నైపుణ్యం సాధించిన వారికి విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, సేవాభావం, ప్రాయోగిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని భవిష్యత్తులో మంచి నిపుణులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు బొమ్మ లింగస్వామి, బాతరాజు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## జక్కలవారిగూడెం లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**మునుగోడు, విశాలభారతి :** స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలు మరింత మెరుగైన సేవలు అందుతాయని జక్కలవారిగూడెం సర్పంచ్ జక్కల రేవతిమహేష్ అన్నారు.మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ పాలన అధికారి బొల్లెద్దు లింగ స్వామి, ఉప సర్పంచ్ జక్కలి పార్వతమ్మ ముత్యాలు గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.సునీత ,పాలకవర్గ సభ్యులు జక్కల కృష్ణ ,జక్కల శంకర్ ,రేషన్ డీలర్ కొమ్ము సైదులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## మేరు సంఘానికి ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి



**జనగామ, విశాలభారతి:** జనగామ జిల్లా మేరు సంఘం సమావేశం మంగళవారం దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామంలో జిల్లా కోశాధికారి దీకొండ విష్ణు నివాసంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జనగామ జిల్లా అధ్యక్షులు రాపర్తి ప్రశాంత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా రాపర్తి ప్రశాంత్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ పథక మేరు కులస్తులందరూ ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని, సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో మేరు కుల సభ్యులకు ప్రాధాన్యత ప్రభుత్వం మొదట కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. అనంతరం సీపీఎం మండల సెక్రెటరీ సభ్యులు సీనియర్ నాయకులు సోమ సత్యం మేరు మాట్లాడుతూ, మేరు కులాన్ని ప్రభుత్వం గుర్తించి, ఇప్పటికైనా ప్రభుత్వ పథకాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని, డిమాండ్ చేశారు. మేరు కులానికి చెందిన వారికి 50 సంవత్సరాలకే వృద్ధాప్య పింఛన్ అందించాలని, వెనుకబడిన కుల సంఘాలకు అందుతున్న సంక్షేమ పథకాలను తమ కులానికి కూడా వర్తింపజేయాలని బిసి డి నుండి బిసి ఏ కు మార్చాలని కోరారు. మేరు కుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి న్యాయం చేయాలని సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల అధ్యక్షులు గూడూరు వెంకటేశ్వర్లు జిల్లా నాయకులు కీర్తి యాదగిరి, పొడిశెట్టి లక్ష్మణ్, సంఘ వెంకటనారాయణ, కీర్తి రవి,వొడపల్లి రమేష్, కీర్తి కృష్ణమూర్తి, కొత్తకొండ శ్రీనివాస్, రాయబారపు అశోక్, మునిగాల శ్రీనివాస్ రాయబారపు వెంకటేశ్వర్లు మునగాల సత్యనారాయణ, రామగిరి విజయ్ కుమార్, మండల నాయకులు జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం.. అత్యవసర వైద్య స్పందనపై మాక్ డ్రిల్



**జక్రాన్ పల్లి, విశాలభారతి;** రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో అత్యవసర సేవల స్పందన సమయం, వివిధ శాఖల మధ్య సమన్వయం, క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రికి తరలించే ప్రక్రియను పరిశీలించేందుకు ఈ రోజు సికింద్రాపూర్ లోని సర్వీస్ రోడ్డు లో రోడ్డు ప్రమాదం-అత్యవసర వైద్య స్పందనపై మాక్ డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్‌లో భాగంగా రోడ్డు ప్రమాదానికి సంబంధించిన కృత్రిమ ప్రమాద పరిస్థితిని సృష్టించి, ప్రమాద స్థలానికి 108 అంబులెన్స్, పోలీసు, ఆరోగ్య శాఖ సిబ్బంది చేరుకునే స్పందన సమయాన్ని నమోదు చేశారు. ప్రమాద స్థలంలో క్షతగాత్రులకు అందించే ప్రాథమిక చికిత్స, ట్రయాజింగ్, అత్యవసర స్థిరీకరణ అనంతరం సమీపంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఏరియా ఆసుపత్రికి సురక్షితంగా తరలించే విధానాన్ని ప్రదర్శించారు. ఆసుపత్రి అత్యవసర విభాగం సిబ్బందికి ముందస్తు సమాచారం అందించడం, బాధితులను స్వీకరించడం వంటి ప్రక్రియలను కూడా పరిశీలించారు. అదేవిధంగా ప్రమాద సమయంలో పోలీస్ శాఖ, 108 EMRI, ఆరోగ్య శాఖ, ఆసుపత్రి అత్యవసర వైద్య బృందం మధ్య సమన్వయం, సమాచార మార్పిడి మరియు వేగవంతమైన స్పందనను మాక్ డ్రిల్ ద్వారా పరీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (DMHO) డా. రాజశ్రీ , పోలీస్ శాఖ, 108 EMRI, R&B శాఖ, అగ్నిమాపక శాఖ మరియు DCHS, నిజామాబాద్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు ప్రమాద స్థలం నుంచి ఆసుపత్రి వరకు త్వరిత స్పందన, సమర్థవంతమైన ప్రాథమిక చికిత్స, సరైన ట్రయాజింగ్ మరియు శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు.

## నారాయణపురం కాంగ్రెస్‌లో చేరికలు

- ఉప సర్పంచ్ భూక్య చందుతో పాటు పలువురు వార్డు సభ్యులు
- కండువా కప్పి కాంగ్రెస్ లో ఆహ్వానించిన ఎమ్మెల్యే రామచంద్రనాయక్



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** కురవి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ ఉప సర్పంచ్ భూక్య చందుతో పాటు పలువురు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ లో చేరడం జరిగింది. కురవి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ సమక్షంలో నూతనంగా చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నారాయణపురం గ్రామ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తామని పేర్కొన్నారు. గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకట్, మాజీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం, నారాయణపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు, జిల్లా, మండల నాయకులు, సర్పంచులు, గ్రామ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో టిజి టి టిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



**విశాలభారతి గూడూరు:** సోమవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రం లో.. టీజీ టిటిఎఫ్ గూడూరు మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. టీజీ టిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంగోత్ ధర్మా నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా టి జి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్ సమక్షంలో గూడూరు మండల నూతన కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులు: హంసావత్ శ్రీనివాస్ . మండల అధ్యక్షులు డాక్టర్ వాంకుడోత్ గోపినాథ్ , ప్రధాన కార్యదర్శి .బానోత్ రవి, మండల మహిళ ఉపాధ్యక్షులు బోడ ఝాన్సీ రాణి, మహిళ జనరల్ సెక్రెటరీ బానోత్ విజయ , మండల కోశాధికారి బానోతు రాజ్ కుమార్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర రూప్ల ను.. ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మహబూబాబాద్ జిల్లా కమిటీలో వర్కింగ్ ప్రెసిడెంట్ గా బానోతు మంగీలాల్, జిల్లా ఉపాధ్యక్షులుగా బానోతు వీరన్న బోడా మంగీలాల్, జిల్లా కార్యదర్శిగా ఇస్లావత్ చందా నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా భూక్యా బాలు నాయక్, టి జి .టి టిఎఫ్ సి ఆర్ టి డబుల్ ఐ ఎన్ జి అధ్యక్షులుగా తేజావత్ పూల్య తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## కాంగ్రెస్‌కు గట్టి షాక్.. బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ కార్యకర్తలు

- పెద్ద నాగారంలో 10 మంది కార్యకర్తల చేరిక
- మాజీ మంత్రి రెడ్యానాయక్ సమక్షంలో పార్టీ కండువాలు




**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నర్సింహులపేట మండలం పెద్ద నాగారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన 10 మంది కార్యకర్తలు మాజీ మంత్రి రెడ్యానాయక్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగిపోయిన తాము బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రెడ్యానాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను వంచించిందని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమం విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు సమన్వయంతో కష్టపడి పనిచేయాలని రెడ్యానాయక్ సూచించారు. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, బీఆర్ఎస్ విధానాలను విస్తృతంగా ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. పెద్ద నాగారంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి జరిగిన ఈ చేరికలు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## చలో ఉస్మానియా విజయవం చేయాలి

- ఆలేరు నుంచి భారీగా విద్యార్థుల తరలింపు




**ఆలేరు,విశాల భారతి:** ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న విద్యార్థుల జాతీయ సదస్సుకు ఆలేరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులను తరలించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరుకానున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి విద్యార్థులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉత్సాహంగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కందుల నర్సింగరావు మాదిగ, పట్టణ అధ్యక్షుడు పుల్లూరు రవి మాదిగ, జిల్లా నాయకుడు మల్లేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ మండల నాయకుడు గంధమల్ల కార్తీక్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి వాచా రమేష్ మాదిగ, ఐటీఐ ప్రొఫెసర్ జయరావు మాదిగ, గంధమాల రమేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొలనుపాక గ్రామ శాఖ అధ్యక్షుడు, ఆలేరు ఎమ్మార్పీఎస్-ఎంఎస్ఎఫ్ నాయకులు మణికంత, రాజరాజు, కార్తీక్, పందుల ప్రశాంత్, బొమ్మల అభిషేక్, యాకరి నిఖిల్‌తో పాటు పలువురు విద్యార్థులు చలో ఉస్మానియా కార్యక్రమానికి తరలివెళ్లారు.

## సౌత్ జోన్ వాలీబాల్ జట్టుకు సుంకిశాల ఉదయ్ కిరణ్



**ఆత్మకూరు (ఎం), విశాల భారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం సర్వేపల్లి గ్రామానికి చెందిన సుంకిశాల ఉదయ్ కిరణ్ వాలీబాల్‌లో ప్రతిభను చాటుతూ ప్రతిష్ఠాత్మక సౌత్ జోన్ వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు. వరుసగా రెండోసారి సౌత్ జోన్ జట్టుకు ఎంపిక కావడం విశేషం. నిరంతర సాధన, కఠోర శ్రమ, పట్టుదలతో వాలీబాల్‌లో రాణిస్తున్న ఉదయ్ కిరణ్ మరోసారి సౌత్ జోన్ స్థాయికి ఎంపిక కావడంపై కుటుంబ సభ్యులు, స్నేహితులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. పలువురు క్రీడా ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఉదయ్ కిరణ్ సాధించిన విజయం యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు.

## సేవా జ్యోతి బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి



**మోటకొండూర్, విశాల భారతి:** భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో మంగళవారం ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా అక్టోబర్ 7న నిర్వహించనున్న సేవా జ్యోతి బైక్ ర్యాలీపై సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల ఇన్‌చార్జి మచ్చ వివేక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ర్యాలీ విజయవంతానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా మచ్చ వివేక్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల సేవ, సమర్పణను పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమంలో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అభివృద్ధి చెందిన భారతదేశం దిశగా సాగుతున్న నేపథ్యంలో అక్టోబర్ 7న జరిగే సేవా జ్యోతి బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చిర్ర రవీందర్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్ల అశోక్, గౌరవ వార్డు సభ్యులు రేగు మల్లేష్, ఆలేటి నాగరాజు, సీనియర్ నాయకులు బాల నరసింహులు, శనిగరం ప్రదీప్, భూమండ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ భద్రతకు సర్పంచ్ శ్రీలత సుందర్ ప్రత్యేక చొరవ

- **రూ.5.60 లక్షలతో సీసీ కెమెరాల ఏర్పాటు**




**చౌటుప్పల్ విశాల భారతి;** మండలంలోని పంతంగి గ్రామంలో ప్రజల భద్రత, నేర నియంత్రణ కోసం సర్పంచ్ శ్రీలత సుందర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ.5.60 లక్షల విలువైన 26 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో చౌటుప్పల్ సీఐ మన్మధ కుమార్, ఎస్సై నర్సిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సీసీ కెమెరా వ్యవస్థను ప్రారంభించారు. గ్రామానికి చెందిన కంపెనీ ప్రతినిధులు శ్రీకాంత్, సత్య నారాయణలు 26 కెమెరాలను విరాళంగా అందించారు. ఇది అభినందనీయమని సీఐ మన్మధ కుమార్ పేర్కొన్నారు. కెమెరాల ద్వారా ప్రధాన కూడళ్లు, రహదారులు, రద్దీ ప్రాంతాలపై నిరంతర నిఘా ఉంటుందని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత సుందర్, పంచాయతీ కార్యదర్శి కే. పద్మజ, వార్డు సభ్యులు సప్పిడి ప్రభాకర్ రెడ్డి, మాధగోని పరమేశ్వరిశంకర్, అంతటి సౌజన్యప్రవీణ్, మాజీ సర్పంచులు చీరిక సంజీవరెడ్డి, అంతటి రమేష్ గౌడ్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## కురవిలో ఎస్సీ మాల కుల పెద్దమనుషుల ఎన్నిక



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** కురవి మండల కేంద్రంలోని కొత్తకాలనీ ఎస్సీ మాల కుల పెద్ద మనుషులుగా దబ్బేటి నారాయణ, సారకోలా మాల కలగూర నాగరాజు, కులజమానుగా గాజుల సతీష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాత ఎస్సీ కాలనీ కుల పెద్దమనిషి కామిండ్ల వెంకటేశ్వర్లు, సారకోలా మాల మండల రామచంద్రు, కులజమాను దుండ్ర ఉప్పలయ్యతో పాటు కమిటీ సభ్యులు మంగళవారం కొత్తగా ఎన్నికైన పెద్దమనుషులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు. కుల ఐక్యత, సామాజిక అభివృద్ధి కోసం కొత్తగా ఎన్నికైన పెద్దమనుషులు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

## అక్రమ కట్టడాలను అరికట్టండి

- **తాసిల్దార్ కు ఫిర్యాదు చేసిన నందిపేట్ వి డి సి**



**ఆర్మూర్ ,విశాల భారతి:** నందిపేట్ మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కన గల పడగల చెరువు బఫర్ జోన్ భూములను అక్రమంగా కబ్జా చేస్తూ కమర్షియల్ మడిగేలను నిర్మిస్తున్న నూతపల్లి నితిన్ రెడ్డి , నూత్ పల్లి సర్పంచ్ రాజారెడ్డి మరియు ఇతర వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని నందిపేట్ తాసిల్దార్ కు మంగళవారం నందిపేట్ వీడిసి సభ్యులు ఫిర్యాదు చేశారు. కట్టడాలను నిలిపివేయాలని నందిపేట్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. కొంతమంది వ్యక్తులు ఈ ప్రభుత్వ భూములు చెరువు భూములు ఆలయ భూములు ఆక్రమించే పనిలో పడి ఆ భూములకు నిర్మాణ అనుమతులు ఇస్తూ ప్రశ్నించిన వారిపై కేసులు చేస్తూ బెదిరిస్తున్నారని వెంటనే అధికారులు నాయకులు ఈ విషయం పైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకొని తప్పు చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నందిపేట వి డి సి అధ్యక్షులు మంతెన శీను, ఎల్లయ్య, దుబాయ్ శీను, శ్రీకాంత్, రాము, కార్తీక్, ఆర్మూర్ గంగారం ,ఎడ్డిగారి చిన్నయ్య, కంతం చిన్నయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పంతంగి గ్రామంలో నూతన సీసీ కెమెరాల ఏర్పాటు



**చౌటుప్పల్,విశాల భారతి;** మండలం పంతంగి గ్రామంలో ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు, నేరాల నియంత్రణ, ఛేదనలో భాగంగా నూతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మధ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన భద్రత కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ తమ పరిసరాల్లో భద్రతను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై డి. నర్సిరెడ్డి, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి : కలెక్టర్ అంకిత్

- **విద్య, వసతులు, భోజన సదుపాయాలపై కస్తూరిబా విద్యాలయంలో తనిఖీ**
- **నీట్ కోచింగ్‌తో విద్యార్థులకు మెరుగైన**
- **శిక్షణ - విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలి**



**పాల్వంచ విశాల భారతి:** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అందుతున్న విద్యా బోధన, నీట్ కోచింగ్, విద్యార్థుల హాజరు, పరీక్షల నిర్వహణ, మౌలిక వసతులు, భోజన సదుపాయాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులకు సూచించారు. తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ ముందుగా ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుల హాజరు నమోదును పరిశీలించారు. పాఠశాలలో బోధనా కార్యక్రమాలు సక్రమంగా కొనసాగుతున్నాయా, ఉపాధ్యాయుల హాజరు ఎలా ఉంది, విద్యార్థుల హాజరు శాతం ఎంత అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, గైర్హాజరయ్యే విద్యార్థుల వివరాలను నమోదు చేసి, అవసరమైన సందర్భాల్లో వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలని సూచించారు.

అనంతరం ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులు ఏ సబ్జెక్టుకు పరీక్ష రాస్తున్నారో అడిగి తెలుసుకోగా, కెమిస్ట్రీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. పరీక్షల అనంతరం విద్యార్థులకు నిర్వహిస్తున్న అధ్యయన కార్యక్రమాల గురించి కూడా కలెక్టర్ ఆరా తీశారు. నీట్ కోచింగ్‌లో భాగంగా విద్యార్థులకు సాయంత్రం 3.45 గంటల నుంచి 6.00 గంటల వరకు అదనపు బోధనా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ తరగతుల్లో కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ తదితర సబ్జెక్టుల్లో బోధన అందిస్తున్నట్లు వివరించారు. నీట్ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు సమర్థవంతంగా సన్నద్ధమయ్యేలా అదనపు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పాఠశాలలోని 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడారు. విద్యార్థులు ఏ తరగతిలో చదువుతున్నారు, ఆరోజు ఏ సబ్జెక్టుకు పరీక్ష రాశారు, పరీక్ష ఎలా జరిగింది, తదుపరి పరీక్ష ఏ సబ్జెక్టులో ఉంది వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సామాజిక శాస్త్రం, గణితం తదితర సబ్జెక్టుల పరీక్షలకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు తెలిపారు. ఎస్.ఎ1 పరీక్షల్లో 80 మార్కులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులతో మాట్లాడిన సందర్భంగా వారి చదువుపై ఆసక్తి, పరీక్షలకు సన్నద్ధమవుతున్న తీరు, తరగతుల నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు. పరీక్షలు పూర్తయిన అనంతరం తదుపరి పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదువుకోవడంతో పాటు పరీక్షలకు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య, తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్యను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మొత్తం 355 మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా ఆయన అడిగి తెలుసుకుని, విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, వారి విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు.

అనంతరం విద్యాలయంలోని కిచెన్ షెడ్డును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ ఆహారం అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను స్వయంగా పరిశీలించి, వాటి నాణ్యత, పరిమాణం, పరిశుభ్రతను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సరుకులు, కూరగాయలు,వంటగది పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత ప్రమాణాలను పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వంట ప్రక్రియ నుంచి భోజనం వడ్డించే వరకు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం అందేలా సంబంధిత సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. గత సంవత్సరం నాబార్డ్ నిధుల ద్వారా మంజూరైన నిధులతో నూతనంగా నిర్మించిన అదనపు కిచెన్ షెడ్డును కూడా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల వివరాలు, ప్రస్తుతం షెడ్డును ఏ విధంగా వినియోగిస్తున్నారనే విషయాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నిర్మించిన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యా బోధనతో పాటు నాణ్యమైన వసతులు, పౌష్టికాహారం, పరిశుభ్రమైన వాతావరణం, అదనపు శిక్షణ అందించడం ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. విద్యార్థుల హాజరును మెరుగుపరచడంతో పాటు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా నిరంతరం మార్గనిర్దేశం చేయాలని, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం

- **కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తాం: భీమ్‌గల్ కాంగ్రెస్ నాయ**



**విశాల భారతి నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్;** భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలో సోమవారం ఉదయం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన పోలస సుధాకర్ కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల ఆర్థిక సాయం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకుంటామని భీమ్‌గల్ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సుధాకర్ మృతి అత్యంత దురదృష్టకరమైన ఘటన అని పేర్కొంటూ, బాధిత కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని వారు వెల్లడించారు. ఈ విషయాన్ని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్, మాజీ స్టేట్ కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సుధాకర్ కుటుంబ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తరఫున తక్షణ సహాయం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. బాధిత కుటుంబానికి అవసరమైన న్యాయపరమైన, ఆర్థిక సహాయాన్ని కూడా అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భీమ్‌గల్ కాంగ్రెస్ నాయకులు బోదిరే స్వామి, కన్నె సురేందర్, జేజే నర్సయ్య, అనంత్‌రావు, సంగ్యా నాయక్ తదితరులు మాట్లాడుతూ.. సుధాకర్ మృతి పట్ల విచారం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

- **కిరాణా వ్యాపారిపై కేసు నమోదు**
- **ఎస్ఐపై వచ్చిన ఆరోపణలపైనా శాఖాపరమైన విచారణ:**
- **సీఐ సత్యనారాయణ గౌడ్**






**నిజామాబాద్ జిల్లా విశాల భారతి;** భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లో జరిగిన సంఘటనపై మృతిని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలస సుధాకర్ మృతి ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి బాధ్యులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని సీఐ పొన్నం సత్యనారాయణ గౌడ్ తెలిపారు. సుధాకర్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక కిరాణా వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. కిరాణా వ్యాపారితో పాటు ఎస్ఐ తిరుపతిపై కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలపై కూడా డిపార్ట్‌మెంట్ పరంగా విచారణ జరిపి, విచారణలో తేలిన అంశాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**భారీగా పోలీసు బలగాల మోహరింపు**

సుధాకర్ కుటుంబానికి న్యాయం చేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో భీమ్‌గల్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పట్టణంలో పోలీసులు భారీగా బలగాలను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**కేసుల నమోదుతో ముగిసిన ఆందోళన**

సుధాకర్ కుటుంబ సభ్యులు, అఖిలపక్ష నాయకులు, స్థానిక వ్యాపారులు చేపట్టిన ఆందోళన సాయంత్రం వరకు కొనసాగింది. బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయడంతో అఖిలపక్షం నాయకులు ఆందోళనను విరమించినట్లు సమాచారం. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. బాధ్యత కుటుంబానికి ప్రభుత్వం 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని బాధిత కుటుంబ సభ్యులతో అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు.

## కమిటీ ఎటు పోయింది

- **సి.పి.ఎస్ రద్దుపై నిర్లక్ష్యం తగదు.**
- **రెండు వేల మూడు డిఎస్సీ బాధితులకు తక్షణమే పాత పెన్షన్ అమలుచేయాలి..**



**అడవిదేవులపల్లి విశాల భారతి ;** తెలంగాణ సి. పి. ఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగవెల్లి ఉపెందర్. ఉద్యోగ సంగాల జేఏసీలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ బాజు ల మధ్య గత నెల సెప్టెంబర్ 23 న సచివాలయంలో జరిగిన చర్చల ఫలితంగా సి.పి.ఎస్ విధానం రద్దుపై మూడు నెలల కాల పరిమితితో కమిటీ వేస్తామని ప్రధాన కార్యదర్శి సంజయ్ బాజు హామి ఇచ్చారని కానీ అక్టోబర్ ఒకటిన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆ అంశమే ప్రస్తావించకపోవడం బాధాకరం అని తెలంగాణ సి.పి. ఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగవెల్లి ఉపెందర్ అన్నారు. హైదరాబాద్ లోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ సి. పి.ఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో డెబ్బై శాతం పైగా ఉన్న రెండు లక్షల ఎనభైవేల సి.పి.ఎస్ ఉద్యోగుల కుటుంబాలు పాత పెన్షన్ ప్రకటన కోసం ఎదురు చూస్తున్నాయని ప్రభుత్వం ప్రకటించిన విధంగా సి.పి.ఎస్ రద్దుకోసం వెంటనే మూడు నెలల కాల పరిమితితో కమిటీ వేయాలని, దశాబ్ద కాలంగా సి.పి.ఎస్ రద్దే ఏకైక ఎజెండాగా పోరాటం చేస్తున్న సి. పి. ఎస్ ఉద్యోగ సంఘాలకు ఆ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పాత పెన్షన్ ప్రకటన ప్రభుత్వానికి మేలుచేస్తుందన్నారు. రెండువేల మూడు డిఎస్సి బిధితులకు పాత పెన్షన్ అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వం, సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటీషన్ వేయడం విడ్డూరంగా ఉందని,కమిటీతో సంబంధం లేకుండా తక్షణమే వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి సనాతన బాలస్వామి,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మన్నూరు నాగన్న, తిరుపతి,సందీప్, శ్రీనివాస్,శోభన్, విజయ్ బాస్కర్ రెడ్డి వివిధ జిల్లాల అధ్యక్షులు కొరివి కృష్ణ, నేరెళ్ళ దేవరాజు,దుర్గ ప్రసాద్,క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ లో బర్రెల దొంగల ముఠా అరెస్ట్.. బర్రె,ఆటో,నగదు స్వాధీనం

**చౌటుప్పల్,విశాల భారతి;** చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెడ్డిబావి ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బర్రెల దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. అనుమానాస్పదంగా వెళ్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా, తప్పించుకునేందుకు యత్నించిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు పలుచోట్ల బర్రెల దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. నిందితులు అడ్డాడి రాఘవేంద్రరావు, దాసరి యాదయ్య, అడ్డాడి శ్రీనివాసరావు, చాపల సైదులు కలిసి గత ఆగస్టు 8న చౌటుప్పల్ రామ్ నగర్ కాలనీలో 2 బర్రెలు, 3 దూడలను దొంగిలించి, వాటిలో ఒక బర్రె, మూడు దూడలను విక్రయించారు. సెప్టెంబర్ 11న కాటమయ్య కాలనీలో మరో బర్రెను దొంగిలించి కోదాడలో విక్రయించారు. తాజాగా అక్టోబర్ 4న లింగారెడ్డిగూడెం శివారులోని బర్రెల షెడ్డు తాళం పగలగొట్టి ఒక బర్రెను దొంగిలించి, చౌటుప్పల్ శివారు అటవీ ప్రాంతంలో దాచిపెట్టారు. దాన్ని అక్టోబర్ 6న కోదాడ సంతకు తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల వద్ద నుంచి ఒక బర్రె, టీఎస్ 08 యూఏ 3407 నంబర్ గల ఆటో, మొబైల్ ఫోన్లు, రూ.80 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వారి నేరాంగీకారం ఆధారంగా గతంలో విక్రయించిన బర్రెలను కూడా రికవరీ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా పశువుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ప్రజల భద్రత కోసం నిరంతరం వాహన తనిఖీలు, నిఘా కొనసాగిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్ తెలిపారు.

## కొలనుపాక కురుమ సంఘం నూతన కార్యవర్గం

- **ఎమ్మెల్యే ఐలయ్య అభినందనలు**



**ఆలేరు, విశాల భారతి:** కొలనుపాక గ్రామ శ్రీ బీరప్ప కురుమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పరెద సతీష్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి తమ ఎన్నిక వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు. కురుమ సామాజిక వర్గ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. సంఘం ఐక్యతతో పనిచేస్తూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ కురుమ సంఘాన్ని ఐక్యంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు కొలనుపాక గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం పెద్దలు, యువకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పరెద సతీష్‌తో పాటు బండ వీరమల్లయ్య, బాలరాజు, బలరాం, ఒగ్గు మల్లేష్, సంపత్, శ్రీను, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని వైద్య సేవలపై ఉక్కుపాదం

- **రికార్డులు, అనుమతి పత్రాలపై అధికారుల క్షుణ్ణ పరిశీలన**
- **టి. అశోక్ నిర్వహిస్తున్న క్లినిక్‌ను సీజ్ చేసిన అధికారులు**
- **అర్హతకు మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు**
- **సూదులు, సెలైన్లు, ఇంజక్షన్లపై అనర్హులకు నిషేధం**
- **అనుమతులు లేకుండా క్లినిక్‌లు నడిపితే సీజ్ తప్పదు**
- **జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ వైద్య సంస్థలపై తనిఖీలు ముమ్మరం**
- **గార్లలో వైద్యశాఖ ఆకస్మిక తనిఖీలు**







**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** అనుమతులు లేకుండా వైద్య సేవలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ హెచ్చరించారు. మంగళవారం గార్ల మండలంలో ప్రైవేట్ వైద్య సంస్థలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హర్ష ల్యాబ్, శ్రీ చక్ర ల్యాబ్, శ్రీరామ హాస్పిటల్‌లో రికార్డులు, అనుమతి పత్రాలు, ఇతర వైద్యపరమైన పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అర్హత లేని ప్రైవేట్ వైద్య ప్రాక్టీషనర్ టి. అశోక్ నిర్వహిస్తున్న క్లినిక్‌ను అధికారులు సీజ్ చేశారు. అర్హత లేని వ్యక్తులు వైద్య సేవలు నిర్వహించడం చట్టవిరుద్ధమని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు. అర్హత లేని ప్రైవేట్ వైద్య ప్రాక్టీషనర్లు తమ పరిధిలోని ప్రాథమిక స్థాయి సేవలకు మాత్రమే పరిమితం కావాలని, అర్హతకు మించిన వైద్య చికిత్సలు నిర్వహించరాదని సూచించారు. ముఖ్యంగా సూదులు, సెలైన్లు, ఇంజక్షన్లు వంటి వైద్య ప్రక్రియలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, సంబంధిత నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు లేకుండా ఆసుపత్రులు, క్లినిక్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని సీజ్ చేస్తామని నిర్వాహకులకు హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన వైద్య సేవలు అందేలా జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబొరేటరీలపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. తనిఖీల్లో డాక్టర్ విరాజిత, డాక్టర్ శివకుమార్, సీహెచ్ఓ జ్ఞానసుందరి, జూనియర్ అసిస్టెంట్ రాకేష్ పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పేరుతో ఓటు హక్కుకు కోతా?

- ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపును వెంటనే ఆపాలి : మల్‌రెడ్డి రంగారెడ్డి
- సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష వైఖరిని విడనాడాలి.. తొలగించిన పేర్లను పునరుద్ధరించాలి




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితా నుంచి అర్హులైన పౌరుల పేర్లను తొలగించే ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉందని ఆయన విమర్శించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని, దానిపై ఎలాంటి అనుమానాలకు తావులేని విధంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగాలని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష నిరసన ధర్నాలో మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం అఖిలపక్ష నాయకులతో కలిసి అదనపు కలెక్టర్ డా. కిరణ్మయికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితాలో అనర్హత పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఫారం6, ఫారం7కు సంబంధించిన వివాదాస్పద నిబంధనలను పునఃపరిశీలించి, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ప్రక్రియను సరళీకరించాలని కోరారు.b"ఓటర్ల జాబితా పారదర్శకంగా లేకపోతే ప్రజాస్వామ్య ఎన్నికలపై ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుంది? ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘమే అనుమానాలకు తావిచ్చేలా వ్యవహరించడం సరికాదు" అని మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఓటర్ల డేటా కేంద్రీకరణను నిలిపివేసి, స్థానిక ఎన్నికల అధికారులకు ఓటర్ల జాబితాల నిర్వహణపై పూర్తి ప్రాప్యత కల్పించాలని కోరారు. ఎన్నికల డేటాపై తటస్థ ఐటీ నిపుణులతో స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తొలగించాలని, ఎన్నికల కమిషనర్ల నియామకంలో పారదర్శకత కోసం ప్రధాని, లోక్‌సభ ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన ఎంపిక కమిటీ ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం అఖిలపక్షంగా ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తామని మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, డీసీసీ అధ్యక్షురాలు చిగురింత పారిజాత, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దీప భాస్కర్ రెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బోడ సామేలు, సిపిఎం పార్టీ రాష్ట్ర కౌన్సిలింగ్ సభ్యులు అందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి, సర్పంచ్ల ఫారం అధ్యక్షులు జక్కుల రవీందర్ రెడ్డి, లస్కర్ గూడ సర్పంచ్ అల్లే ఐలయ్య యాదవ్, మండల పార్టీ సిపిఐ కార్యదర్శి మాజీ కార్పొరేటర్ అజ్మీర హరి సింగ్ నాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో భారీ ఏటీఎం చోరీ

- ఏటీఎం మిషన్ ధ్వంసం.. రూ.30 లక్షలకు పైగా నగదు అపహరణ

**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని శాతంరాయి వద్ద యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో భారీ చోరీ కలకలం రేపింది. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు ఏటీఎం కేంద్రంలోకి చొరబడి, ఏటీఎం మిషన్‌ను పగులగొట్టి అందులోని రూ.30 లక్షలకు పైగా నగదును అపహరించినట్లు ప్రాథమిక సమాచారం. చోరీ అనంతరం దుండగులు అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. ఏటీఎంలో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన బ్యాంకు అధికారులు వెంటనే శంషాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఏటీఎం కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. చోరీ జరిగిన తీరును పరిశీలిస్తూ ఆధారాలను సేకరించారు. పోలీసులతో పాటు క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని దుండగులకు సంబంధించిన ఆధారాల కోసం తనిఖీలు చేపట్టింది. ఏటీఎం కేంద్రంలో ఉన్న సీసీ కెమెరాల దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దుండగులు ఏ సమయంలో ఏటీఎంలోకి ప్రవేశించారు, ఎంతమంది ఉన్నారు, ఏ వాహనంలో వచ్చారనే అంశాలపై ఆరా తీస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. గతంలో ఇలాంటి చోరీలకు పాల్పడిన వ్యక్తుల వివరాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. చోరీకి గురైన నగదు మొత్తం ఎంత అనేది బ్యాంకు అధికారులు నిర్వహిస్తున్న లెక్కల పరిశీలన అనంతరం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ ఘటనతో శాతంరాయి ప్రాంతంలో ఒక్కసారిగా కలకలం నెలకొంది. ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## రాహుల్ గాంధీ సిద్ధాంతాన్ని రాష్ట్రంలో అమలు చేయాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్




**ముషీరాబాద్, విశాల భారతి:** జనాభా దామాషా ప్రకారం నామినేటెడ్ పదవులు ఇవ్వాలని గతంలో ప్రకటించిన రాహుల్ గాంధీ సిద్ధాంతాన్ని రాష్ట్రంలో విస్మరించకుండా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాదిగలకు అవకాశం కల్పించకపోవడంపై విద్యానగర్ లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాదిగలను తీవ్రంగా మోసం చేస్తుందని గతంలో ఇచ్చిన హామీని మరిచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులను రెడ్డి సామాజిక వర్గంకు చెందిన వారిని ప్రకటించి మాదిగలకు ద్రోహం చేసిందన్నారు. గతంలో కూడా ఇదే విధంగా కల్లబొల్లి మాటలు చెప్పారని విమర్శించారు. రాహుల్ గాంధీ జనాభా దామాషా ప్రకారం నామినేటెడ్ పదవులు గుంజుకోవాలని పదే పదే చెబుతుంటే రేవంత్ రెడ్డి దానిని విస్మరించి ఆరు శాతం లేని రెడ్లకు పదవులు అంటగడుతూ సిద్ధాంతాలను తుంగలో తొక్కుతున్నారని ఫైర్ అయ్యారు. వెంటనే ఎమ్మెల్సీ అభ్యర్థులుగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని అంబేద్కర్ అభయ హస్తం పేరున 12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు సంవత్సరాలు గడిచిన ఏ ఒక్కరికి కూడా అంబేద్కర్ అభయాసం పథకం అమలు చేయలేదన్నారు. ఇంతవరకు ఒక్కరికి కూడా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వలేదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసినప్పుడు మాదిగ జనాభా ఎక్కువగా ఉన్నారని ప్రకటించినప్పుడు పదవులు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ చెప్పే మాటలకు రేవంత్ రెడ్డి చేష్టలకు పొంతన లేకుండా పోతుందని వెంటనే జనాభా దామాషా ప్రకారం మాదిగలకు పదవులు కేటాయించి అన్ని రంగాలలో సమాన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి




**ముషీరాబాద్, విశాల భారతి:** అవంతి డిగ్రీ, పీజీ కాలేజ్ బర్కత్పురా, నారాయణగూడ, దిల్సుక్ నగర్ బ్రాంచ్ ల ఫ్రెషర్స్ డే వేడుకలు హైదరాబాద్ నాగోల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జూనియర్, సీనియర్ విద్యార్థులు పాల్గొని ఆటపాటలతో వినూత్న కార్యక్రమాలతో అలరించారు. మంగళవారం జరిగిన కార్యక్రమానికి ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కుమార్ మొలుగరం, అవంతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ వ్యవస్థాపకులు అవంతి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓయూ విసి కుమార్ మొలుగరం మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీ అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. క్వాలిటీ ఎడ్యుకేషన్ స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్ పై దృష్టి సాధించాలని విద్యార్థులను కోరారు. అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ చదువు తోపాటు నైపుణ్యం ఉన్నట్లయితే విద్యార్థులు ఏ డిగ్రీ కోర్స్ చదివిన నైపుణ్యం ఉంటే ఏవృత్తిలో అయిన రాణించగలుగుతారని తెలిపారు.. అవంతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ గత 35 సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐదు లక్షల మంది పైగా విద్యార్థులు విద్యను అభ్యసించారని చెప్పారు. రాబోయే రోజుల్లో అవంతి గ్రూపును యూనివర్సిటీ స్థాయిలో తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు.. తమ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు ఎక్కువ మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అందించడమే తమ విద్యా విధానమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్స్టిట్యూషన్స్ డీన్స్, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు, బోధన బోధ నేతల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిట్టంపల్లి నిరుద్యోగ యువతకు ముఖ్య గమనిక

- నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ,ఉపాధి అవకాశాలు
- గోలి మల్లేష్ పిట్టంపల్లి గ్రామ సెక్రటరీ

**చిట్యాల విశాలభారతి:** మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో ప్రభుత్వ సూచన మేరకు 18 నుంచి 35 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ అంశాల్లో ఉపాధి అవకాశాలను పొందుటకై శిక్షణ కల్పించనున్నట్లు గ్రామ సెక్రెటరీ గోలి మల్లేష్ తెలిపారు. అర్హులైన యువతీ యువకులు తమ ఆధార్, కుల, విద్యార్హత, మొబైల్, ఆసక్తి వున్న రంగం మొదలైన వివరాలను గ్రామపంచాయతీ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని, ఈ సదావకాశాన్ని అర్హులైన యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో ఆయన కోరారు.

## ఎన్నికల కమిషన్ తీరుపై యువజన కాంగ్రెస్ సమరం

- తెలంగాణ ఈసీ కార్యాలయం ముట్టడి.. జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఎన్నికల సంఘం తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ తెలంగాణ యువజన కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తెలంగాణ ఎన్నికల కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి, తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల జాబితాల్లో ఓట్ల తొలగింపు అంశంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించబడ్డాయంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజకీయ ప్రభావాలకు లోనై వ్యవహరిస్తున్నారంటూ జక్కిడి శివచరణ్ రెడ్డి ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం అధికారికంగా ధృవీకరించలేదు. ఓట్ల తొలగింపు, ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాలు నిర్దేశిత ఎన్నికల నిబంధనలు, అధికారిక ప్రక్రియల ప్రకారమే జరుగుతాయని, దీనిపై ఎన్నికల సంఘం వైపు నుంచి స్పష్టత రావాల్సి ఉందని పేర్కొన్నారు. జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ ఆదేశాల మేరకు జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జక్కిడి శివచరణ్ రెడ్డి తెలిపారు. తమ డిమాండ్లపై స్పందన రాకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేందుకు పారదర్శకత, స్పష్టమైన వివరణలు అవసరమని యువజన కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, పాలడుగు నాగార్జున తో పాటు వివిధ జిల్లాల అధ్యక్షులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## త్రిలోక్ కొత్తపల్లిని ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి



- క్యాన్సర్‌పై అవగాహన కోసం జపాన్‌లో 1,800 కిలోమీటర్ల సైకిల్ యాత్ర

**కాప్రా అక్టోబర్ 6, విశాల భారతి;** కాప్రా–ఈసీఐఎల్‌కు చెందిన యువ అథ్లెట్ త్రిలోక్ కొత్తపల్లి అంతర్జాతీయ సైకిల్ యాత్రలో భారత్ తరపున పాల్గొననున్న సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. జపాన్‌లో అక్టోబర్ 9 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఖండాంతర సైకిల్ యాత్రలో ఆరు దేశాలకు చెందిన 58 మంది సైక్లిస్టులు పాల్గొననున్నారు. సుమారు 1,800 కిలోమీటర్ల మేర జరిగే ఈ సైకిల్ యాత్ర ద్వారా క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు క్యాన్సర్ చికిత్స, పరిశోధనలకు మద్దతు అందించనున్నారు. ఈ యాత్రలో త్రిలోక్ మూడో బృందంలో భాగంగా అక్టోబర్ 12 నుంచి 14వ తేదీ వరకు ఉఏదా, నాగానో ప్రాంతాల నుంచి గిఫు వరకు సైకిల్ యాత్ర చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా 58 మంది పాల్గొంటున్న ఈ గొప్ప సామాజిక సేవా కార్యక్రమంలో కాప్రా ప్రాంతానికి చెందిన త్రిలోక్ భారత్ తరపున పాల్గొనడం ఎంతో గర్వకారణమన్నారు. యువతకు త్రిలోక్ ఆదర్శంగా నిలుస్తున్నారని, క్రీడలు, శారీరక దృఢత్వంతో పాటు సామాజిక సేవ కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. క్యాన్సర్ పరిశోధనకు రూ.12 లక్షల నిధుల సేకరణ ఈ కార్యక్రమంలో భాగంగా త్రిలోక్ వ్యక్తిగతంగా రూ.1 లక్ష నిధులను సేకరించారు. అలాగే భారత దేశానికి చెందిన సైకిల్ యాత్రికుల బృందం కలిసి సుమారు రూ.12 లక్షల నిధులను సమీకరించింది. ఈ నిధులను ముంబైలోని టాటా స్మారక ఆసుపత్రిలో క్యాన్సర్ పరిశోధన, రోగుల సంరక్షణ కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, జి. అంజయ్య, సీనియర్ నాయకులు నీలం రెడ్డి తదితరులు త్రిలోక్‌ను అభినందించి, జపాన్ సైకిల్ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కాప్రా–ఈసీఐఎల్ నుంచి అంతర్జాతీయ సైకిల్ వేదిక వరకు త్రిలోక్ సాగిస్తున్న ప్రయాణం యువతకు క్రీడలు, ఆరోగ్యం, శారీరక దృఢత్వం, సామాజిక సేవ పట్ల స్ఫూర్తినిచ్చేలా ఉందని వారు పేర్కొన్నారు**.ఒక సైకిల్ యాత్రికుడు.. 1,800 కిలోమీటర్ల లక్ష్యం.. కోట్లాది మందికి ఆశా సందేశం. క్యాన్సర్‌పై పోరాటానికి త్రిలోక్ చేస్తున్న ఈ ప్రయాణం స్ఫూర్తిదాయకం.

## నారాయణపురంలో భూముల రీసర్వేకు శ్రీకారం

- క్షేత్రస్థాయిలో హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాల పరిశీలన



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** కురవి మండలం నారాయణపురం గ్రామంలో భూముల రీసర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ ధారావత్ భాస్కర్ రీసర్వే ప్రక్రియను ప్రారంభించారు. భూముల వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డుల్లో ఉన్న వివరాలతో సరిపోల్చి అవసరమైన సవరణలు చేపట్టే ప్రక్రియలో భాగంగా రీసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది గ్రామంలోని భూముల హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి జనగం నిరోష, మండల సర్వేయర్ ధనలక్ష్మి, జీపీఓ రమాదేవి, అల్లూరి వీరభద్రరాజు, రెవెన్యూ సిబ్బంది రీసర్వే ప్రక్రియను పర్యవేక్షించారు. గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు సైతం రీసర్వే కార్యక్రమంలో పాల్గొని తమ భూములకు సంబంధించిన వివరాలను సిబ్బందికి తెలియజేశారు. భూముల వాస్తవ పరిస్థితులను నమోదు చేయడం ద్వారా భవిష్యత్‌లో భూ హద్దులు, విస్తీర్ణం, యాజమాన్యానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. రీసర్వే ప్రక్రియను గ్రామ ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## శాంతినగర్, బృందావన్ కాలనీల్లో పారిశుద్ధ్య పనులు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 52వ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం ఇస్తూ శాంతినగర్ కాలనీ, బృందావన్ కాలనీ పరిసరాలను జేసీబీతో పూర్తిగా శుభ్రం చేయించారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు, పిచ్చిమొక్కలు, ఇతర వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దినట్లు మాజీ కౌన్సిలర్ గంట లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాల పరిశుభ్రతకు అవసరమైన చర్యలను నిరంతరం చేపడతామని గంట లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిఫెన్స్ కాలనీ అభివృద్ధికి మధు యాష్కి ముద్ర

- రూ.52.20 లక్షలతో రెండు పార్కుల అభివృద్ధికి శ్రీకారం.. ప్రజా అవసరాలకే ప్రాధాన్యం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** మాటలకే పరిమితం కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని చాటుతూ ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్‌లో మరో కీలక అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎల్బీనగర్ ఇన్‌చార్జ్, ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కి గౌడ్ ఆధ్వర్యంలో డిఫెన్స్ కాలనీలో రూ.52.20 లక్షల వ్యయంతో రెండు పార్కుల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర యాదవ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ ఈ పనులకు శ్రీకారం చుట్టారు. డిఫెన్స్ కాలనీలోని 2,780 చదరపు గజాల విస్తీర్ణంలో ఒక పార్కు, 547 చదరపు గజాల విస్తీర్ణంలో మరో పార్కును అభివృద్ధి చేయనున్నారు. పార్కుల అభివృద్ధితో కాలనీవాసులకు మెరుగైన పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణం అందడంతో పాటు వాకింగ్, వ్యాయామం, విశ్రాంతికి అనువైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా కాలనీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వడం అభివృద్ధి కార్యక్రమాల లక్ష్యంగా పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని అభివృద్ధి పనులతో నిలబెట్టుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఇతర కాలనీల్లోనూ ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కామేశ్వరరావు, నరసింహ, గోపాల్‌రెడ్డి, కోటేశ్వరరావు, మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణమూర్తి, మల్లారెడ్డి, హరిబాబు, సుధాకర్‌రెడ్డి, మోహనకృష్ణ, సంజీవరెడ్డి, వేణు, రాజవర్ధన్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డి తదితరులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో బీజేపీ నేతల పరిశీలన

- చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం, మెరుగైన సేవలు అందించాలి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** చిన్నారుల ఆరోగ్యం, విద్య, పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని బీజేపీ నాయకులు సూచించారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో రంగనాయకుల గుట్టలోని అంగన్వాడీ కేంద్రాన్ని బీజేపీ నాయకులు సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, విద్య, ఆరోగ్య సేవలు, ఇతర సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యం, ప్రాథమిక అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు సమకూర్చాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన చిన్నారులకు పూర్తిస్థాయిలో అందుతున్నాయా లేదా అన్నది క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరిచి, చిన్నారులకు మెరుగైన సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే తమ లక్ష్యమని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి, నాయకులు పార్వతి, గోవిందచారి, జంజ్య నాయక్, మొగులయ్య, శ్రీకాంత్, బీజేవైఎం నాయకులు అభిలాష్, రీతిక్ తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లుగా ట్రంక్‌లైన్ పనులు పెండింగ్.. ప్రజల అవస్థలు పట్టవా?

- కాంట్రాక్టర్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారుల సమన్వయ లోపంతోనే జాప్యం : మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ మెయిన్‌రోడ్డులోని రాఘవేంద్ర హోటల్ వద్ద, నేతాజీ కాలనీలోని దసరా గుడి బొడ్రాయి వద్ద ట్రంక్‌లైన్ మార్పిడి పనులు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉండటంపై హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు కాంట్రాక్టర్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారుల మధ్య సమన్వయ లోపంతోనే పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. దసరా పండుగ, బొడ్రాయి పండుగలు వచ్చినా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించకపోవడంతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రహదారిపై నెలకొన్న సమస్యలతో వాహనదారులు, స్థానికులు అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. "ఇదే సమస్య ముఖ్యమంత్రి, మంత్రులు లేదా వీఐపీల ఇళ్ల ముందు ఉంటే రెండేళ్ల పాటు అధికారులు ఇలాగే మౌనం వహించేవారా?" అని సామ తిరుమలరెడ్డి ప్రశ్నించారు. సామాన్య ప్రజలకు ఒక న్యాయం, వీఐపీలకు మరో న్యాయం అన్నట్టుగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రతి పౌరుడిని సమానంగా చూడాలనే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి ఇటువంటి వివక్ష విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే పనులను వెంటనే పూర్తి చేసి, రహదారిని సౌకర్యవంతంగా మార్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి ట్రంక్‌లైన్ మార్పిడి పనులను తక్షణమే పూర్తి చేయాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సామ తిరుమలరెడ్డి డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన శానిటేషన్ వర్కర్‌కు ఎమ్మెల్యే పరామర్శ



**నాచారం, అక్టోబర్ 6, విశాల భారతి;** విధి నిర్వహణలో భాగంగా రోడ్డు శుభ్రం చేస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన శానిటేషన్ వర్కర్ నాగారం నరసింహను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. నాచారం డివిజన్‌లో శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్న నాగారం నరసింహ అక్టోబర్ 2న ఉదయం హబ్సిగూడ ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ రోడ్డు శుభ్రం చేస్తుండగా, అకస్మాత్తుగా వచ్చిన ఓ వాహనం ఆయనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసింహ రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం అనంతరం నరసింహను సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆసుపత్రికి వెళ్లి నరసింహను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు, అందుతున్న వైద్య సేవలపై వైద్యులతో చర్చించారు. అనంతరం నరసింహ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయను కలిసి నరసింహకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, గంధం నాగేశ్వరరావు, నాగారం బాబు, ఎస్ఎఫ్ఏ ఏకస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సుప్రియ కుటుంబానికి సత్యవతి రాథోడ్ అండ!

- **కేటీఆర్‌తో నేరుగా ఫోన్‌లో మాట్లాడించిన మాజీ మంత్రి**
- **భౌతికకాయం స్వదేశానికి తరలింపుపై కేటీఆర్ కీలక హామీ**
- **విషాదంలో ఉన్న తల్లిదండ్రులకు ధైర్యం చెప్పిన సత్యవతి రాథోడ్**



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** అమెరికాలోని మిస్సోరి రాష్ట్రం సెయింట్ లూయిస్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రానికి చెందిన దారం సుప్రియ మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. అకాల మరణంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న సుప్రియ కుటుంబానికి మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ అండగా నిలిచారు. ఖమ్మంలో నివాసం ఉంటున్న సుప్రియ తల్లిదండ్రులు శ్రీనివాస్, జ్యోతిని మంగళవారం పరామర్శించి, వారి బాధను పంచుకున్నారు. సుప్రియ మృతి విషయం తెలుసుకున్న సత్యవతి రాథోడ్ స్వయంగా కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఊహించని విషాదంతో కుటుంబం తీవ్ర వేదనలో ఉన్న నేపథ్యంలో ఈ కష్ట సమయంలో తాము అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాల కోసం ముందుంటామని భరోసా కల్పించారు.

**కేటీఆర్‌తో నేరుగా ఫోన్‌లో మాట్లాడించిన సత్యవతి.**

కుటుంబాన్ని పరామర్శించడంతోనే ఆగకుండా సుప్రియ భౌతికకాయాన్ని త్వరగా స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన సహాయ చర్యలపై సత్యవతి రాథోడ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సుప్రియ కుటుంబ సభ్యులను ఫోన్‌లో మాట్లాడించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన కేటీఆర్ వారి పరిస్థితిని అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుప్రియ భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా భారతదేశానికి తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని భరోసా కల్పించారు.

**కన్నీటి కుటుంబానికి ధైర్యం.**

సుప్రియ అకాల మరణం పట్ల కేటీఆర్, సత్యవతి రాథోడ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, సుప్రియ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సుప్రియ భౌతికకాయం స్వదేశానికి చేరే వరకు అవసరమైన సహాయ చర్యల కోసం తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సుప్రియ కుటుంబాన్ని పరామర్శించిన సమయంలో కొంపల్లి శ్రీనివాస్ రెడ్డి, కొంపల్లి వేణుగోపాల్ రెడ్డి, బొడ శ్రీను నాయక్, మన్యు ప్యాట్నీ, కౌసల్యాదేవిపల్లి సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణులకు ఉచ్చులేనా.. అటవీశాఖ నిఘా ఎక్కడ?

- **కేటీపీఎస్ ఎదురుగా విద్యుత్ ఉచ్చులు.. నలుగురు పట్టివేత**
- **అడవి పంది ఆచూకీపై అనుమానాలు.. అసలు వేటగాళ్లెవరు?**
- **గత ఘటనల నుంచి పాఠాలెక్కడ..? వరుస ఘటనలపై పర్యవేక్షణ లోపాల ఆరోపణలు**
- **ఒక్కో ఘటన తర్వాత స్పందించడమేనా.. ముందస్తు నిఘా ఎక్కడ?**



**విశాల భారతి పాల్వంచ :** వన్యప్రాణుల వేటకు విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేసిన ఘటన మరోసారి పాల్వంచ పరిసరాల్లో కలకలం రేపింది. కేటీపీఎస్ ఎదురుగా ఉన్న జామాయిల్ తోటలో విద్యుత్ తీగలతో ప్రాణాంతక ఉచ్చులు ఏర్పాటు చేసిన ఘటనలో నలుగురిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే నలుగురిని పట్టుకోవడంతోనే కేసు ముగిసిపోతుందా? లేక ఈ వేట వెనుక ఉన్న అసలు వ్యక్తులు, వన్యప్రాణుల అక్రమ రవాణా వ్యవహారం, గతంలో జరిగిన ఇలాంటి ఘటనల మూలాలను అధికారులు వెలికితీస్తారా? అన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

**ప్రాణాంతక ఉచ్చు.. ఎవరికి?**

వన్యప్రాణులను పట్టుకునేందుకు విద్యుత్ తీగలను ఉపయోగించడం అత్యంత ప్రమాదకరమైన పద్ధతి. అడవి జంతువు చిక్కుకోవాల్సిన ఉచ్చులో మనిషి చిక్కుకుంటే ప్రాణాలకే ముప్పు. కేటీపీఎస్ వంటి రాకపోకలు ఉండే ప్రాంతానికి సమీపంలోనే ఇలాంటి ఉచ్చులు ఏర్పాటు కావడం ఆందోళన కలిగిస్తోంది.అసలు ఈ ఉచ్చులు ఎప్పుడు ఏర్పాటు చేశారు? విద్యుత్ సరఫరా ఎక్కడి నుంచి తీసుకున్నారు? వేటకు ఉపయోగించిన సామగ్రి ఎవరిది? నలుగురే ఇందులో పాల్గొన్నారా? వారి వెనుక మరెవరైనా ఉన్నారా? గతంలో కూడా ఇదే ప్రాంతంలో వేట జరిగిందా? అనే ప్రశ్నలకు దర్యాప్తులో సమాధానాలు రావాల్సి ఉంది.అడవి పంది ఏమైంది?

ఈ ఘటనలో అత్యంత కీలకంగా మారిన మరో అంశం అడవి పంది ఆచూకీ. ఉచ్చులో అడవి పంది చిక్కినట్లు సమాచారం ఉంటే.. ఆ తర్వాత దాని పరిస్థితి ఏమిటన్నది తేలాల్సి ఉంది.జంతువు ఉచ్చులో చిక్కిందా? చిక్కితే అక్కడే మృతి చెందిందా? ఎవరైనా అక్కడి నుంచి తరలించారా? తరలిస్తే ఎక్కడికి తీసుకెళ్లారు? అనే వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. వన్యప్రాణి ఆచూకీని నిర్ధారించకుండా కేవలం ఉచ్చు ఏర్పాటు చేసిన వారిని పట్టుకోవడంతో కేసు పూర్తి అయినట్లు భావిస్తే అసలు వ్యవహారం వెనుకబడిపోయే అవకాశం ఉంది.గత ఘటనలు గుర్తున్నాయా? పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం పరిధిలో వన్యప్రాణుల వేట, ఉచ్చుల ఘటనలు గతంలోనూ వెలుగులోకి వచ్చాయి. మాధారం అటవీ ప్రాంతంలో వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చులో గర్భిణీ దుప్పి చిక్కుకున్న ఘటన అప్పట్లో చర్చనీయాంశమైంది. మరో ఘటనలో నకిరేపేట ప్రాంతంలో విద్యుత్ ఉచ్చుకు బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ ప్రాణాలు కోల్పోయిన ఘటన అటవీ ప్రాంతాల్లో విద్యుత్ ఉచ్చుల తీవ్రతను స్పష్టం చేసింది. అదే సమయంలో బూర్గంపహాడ్ ప్రాంతంలో చిరుత చర్మం, గోర్లు స్వాధీనం చేసుకున్న ఘటన కూడా వన్యప్రాణుల వేటపై అనుమానాలను పెంచింది. ఒక్కో ఘటన వెలుగులోకి వచ్చినప్పుడు అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. ఇలాంటి ఘటనలకు ముందుగానే అడ్డుకట్ట వేసే స్థాయిలో నిఘా వ్యవస్థ పనిచేస్తుందా? అన్నదే అసలు ప్రశ్న.

**ఘటన తర్వాతే నిఘా ఎందుకు?**

వన్యప్రాణుల సంచారం ఉండే ప్రాంతాలు, అడవి అంచులు, జామాయిల్ తోటలు, నీటి వనరుల పరిసరాలు వేటగాళ్లకు అనుకూలంగా మారే అవకాశం ఉంది. అలాంటి ప్రాంతాలను గుర్తించి నిరంతర గస్తీ, స్థానిక సమాచార వ్యవస్థ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాల్సి ఉంటుంది.కానీ ఉచ్చులు ఏర్పాటు చేసిన తర్వాతే గుర్తించడం.. జంతువు చిక్కిన తర్వాతే స్పందించడం.. నిందితులను పట్టుకున్న తర్వాతే కేసు నమోదు చేయడం వరకే వ్యవస్థ పరిమితమైతే వన్యప్రాణుల సంరక్షణ లక్ష్యం ఎంతవరకు నెరవేరుతుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.నలుగురితోనే కథ ముగుస్తుందా? ప్రస్తుత ఘటనలో పట్టుబడిన నలుగురి వాంగ్మూలాలు కీలకం కానున్నాయి. వారి ద్వారా వేటకు సంబంధించిన ఇతర వ్యక్తుల వివరాలు బయటకు వస్తాయా? వేటాడిన జంతువులను ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరికైనా విక్రయిస్తున్నారా? గతంలో ఇలాంటి ఘటనల్లోనూ వీరి పాత్ర ఉందా? అనే కోణాల్లో దర్యాప్తు సాగితేనే అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.కేవలం నలుగురిని నిందితులుగా చూపించి కేసును ముగిస్తే.. అసలు వేటగాళ్లు తప్పించుకునే అవకాశం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే ఈ కేసులో అటవీశాఖ దర్యాప్తు తీరు కీలకంగా మారింది.వన్యప్రాణుల రక్షణకు పకడ్బందీ చర్యలేవీ వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీశాఖ వద్ద ఉన్న సిబ్బంది, బీట్ వ్యవస్థ, గస్తీ బృందాలు, స్థానిక సమాచారం వంటి వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం కనిపిస్తోంది. ముఖ్యంగా విద్యుత్ ఉచ్చుల విషయంలో అటవీశాఖతో పాటు విద్యుత్, పోలీసు శాఖల సమన్వయం అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఎందుకంటే ఉచ్చు వన్యప్రాణిని లక్ష్యంగా చేసుకున్నా.. అది ఎప్పుడు మనిషి ప్రాణాలను బలితీసుకుంటుందో చెప్పలేని పరిస్థితి. గతంలో అటవీ సిబ్బందే విద్యుత్ ఉచ్చుకు బలైన ఘటన ఉండటం ఈ ప్రమాద తీవ్రతకు నిదర్శనం. ఇప్పుడు అసలు పరీక్ష....ప్రస్తుత ఘటనతో మరోసారి ఒక విషయం స్పష్టమైంది. వన్యప్రాణుల సంరక్షణ అనేది ఘటన జరిగిన తర్వాత కేసు నమోదు చేయడంతో పూర్తయ్యే వ్యవహారం కాదు. వేటకు ముందే నిఘా ఉండాలి.. వేటగాళ్ల కదలికలను గుర్తించాలి.. ఉచ్చులు ఏర్పాటు చేసే అవకాశమే లేకుండా చర్యలు తీసుకోవాలి.ఇప్పుడు కేటీపీఎస్ ఎదురుగా జరిగిన విద్యుత్ ఉచ్చుల ఘటనలో అటవీశాఖ ముందున్న అసలు సవాలు అదే.నలుగురితో కేసు ముగుస్తుందా..?

**అడవి పంది ఆచూకీ తేలుతుందా..?**

వేట వెనుక ఉన్న అసలు వ్యక్తులు బయటపడతారా..?

గత ఘటనలకు ఈ కేసుకు ఏమైనా సంబంధం ఉందా..?

లేక మరో ఘటన జరిగే వరకు వ్యవస్థ మళ్లీ మేల్కొంటుందా..వన్యప్రాణుల రక్షణలో అటవీశాఖ పనితీరుకు ఇప్పుడు ఈ కేసే ఒక పరీక్షగా మారింది.

అధికారి ని వివరణ కోరగా డీఆర్ఓ తెలిపిన వివరాల ప్రకారం.. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. సమాచారం అందిన వెంటనే సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి విద్యుత్ తీగలను తొలగించడంతో పాటు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టామన్నారు. అయితే అక్కడ ఎలాంటి అటవీ జంతువు కనిపించలేదని స్పష్టం చేశారు.

# ఈవీఎం గోడౌన్ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

- **ఎన్నికల సామగ్రి సంరక్షణలో నిర్లక్ష్యానికి తావులేదు: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**




**రాజేంద్రనగర్, విశాల భారతి :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గోడౌన్‌లో భద్రపరిచిన ఎన్నికల సామగ్రి, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా గోడౌన్‌కు ఏర్పాటు చేసిన సీల్‌స్‌ను కలెక్టర్ పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రిని నిబంధనల ప్రకారం భద్రపరిచారా లేదా అన్నది పరిశీలించారు. ఎన్నికల సామగ్రి నిల్వ, నిర్వహణలో ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఈవీఎం గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, ఇతర భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

గోడౌన్ పరిసరాల్లో భద్రతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సీసీటీవీ నిఘా, పోలీసు బందోబస్తు తదితర భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంల భద్రత, సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ తనిఖీలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహశీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు రవీంద్ర గుప్తా, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బృందావన్ కాలనీలో పౌర సమస్యలపై డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన

**రాజేంద్రనగర్, విశాల భారతి :** "వన్ డే - వన్ వార్డ్" కార్యక్రమంలో భాగంగా నార్సింగి సర్కిల్-45 డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి బృందావన్ కాలనీ, వార్డు నం.125లో మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీలో నెలకొన్న పౌర సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా కాలనీలోని వివిధ ప్రాంతాలను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ పెండింగ్‌లో ఉన్న పౌర మౌలిక వసతుల పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా సుమారు అర కిలోమీటర్ మేర పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల పనులను చేపట్టాల్సిన అవసరాన్ని పరిశీలించారు. వాహనదారుల భద్రత దృష్ట్యా అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుపై కూడా అధికారులతో చర్చించారు. అలాగే పనిచేయని, తగినంత వెలుతురు ఇవ్వని వీధి దీపాల సమస్యలను స్థానికులు డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకురాగా, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వెలుతురు, భద్రత కల్పించేందుకు అవసరమైన ప్రాంతాల్లో సింగిల్ ఆర్మ్ వీధి దీపాల స్తంభాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించారు.

కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న వీధి కుక్కల సమస్యపై కూడా డిప్యూటీ కమిషనర్ స్పందిస్తూ, అవసరమైన చర్యలు చేపట్టాలని పారిశుద్ధ్య, పశువైద్య విభాగాల సిబ్బందికి సూచించారు. అదేవిధంగా రోడ్లను ఆక్రమించి నిర్మించిన ర్యాంపులు, పారపిట్ గోడలు, ఇతర నిర్మాణాలను పరిశీలించి, రాకపోకలకు ఇబ్బందులు కలిగించే ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక ప్రజలు నేరుగా తెలియజేసిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, సాంకేతికంగా సాధ్యమైన మేరకు, అందుబాటులో ఉన్న వనరులను వినియోగిస్తూ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. గుర్తించిన ప్రాంతాలను సంబంధిత ఇంజినీరింగ్, పారిశుద్ధ్య, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే పరిశీలించి, అవసరాలను అంచనా వేసి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. "వన్ డే - వన్ వార్డ్" కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటికి వేగవంతమైన పరిష్కారాలు అందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి నేరుగా తీసుకురావడం ద్వారా పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ లక్ష్మీకాంత్ రెడ్డి, డీఈ కార్తీక్, ఎస్‌డబ్ల్యూఎం డీఈ అన్వేష్ రెడ్డి, వార్డు అధికారి సుష్మ, బిల్ కలెక్టర్ నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# పొరుగింటి వారే దొంగలు.. రూ.24 లక్షల చోరీ కేసు ఛేదించిన పోలీసులు

- **రూ.23 లక్షల నగదు, 5 తులాల బంగారు ఆభరణాలు అపహరణ.. ఇద్దరు నిందితుల అరెస్టు**




**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాత్రివేళ ఇంట్లోకి చొరబడి భారీగా నగదు, బంగారు ఆభరణాలను అపహరించిన ఇద్దరు నిందితులను అత్తాపూర్ పోలీసులు, రాజేంద్రనగర్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.8.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఒక సుత్తి, ఒక స్క్రూడ్రైవర్‌ను స్వాధీనం చేసుకున్నారు. చోరీకి గురైన నగదు, బంగారు ఆభరణాల మొత్తం విలువ సుమారు రూ.24 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. అత్తాపూర్ పరిధిలోని హసన్‌నగర్‌లో మదీనా మసీదు సమీపంలోని 42481 నంబర్ ఇంట్లో సెప్టెంబర్ 25, 26 తేదీల మధ్య రాత్రి ఈ చోరీ జరిగింది. బాధితుడు సయ్యద్ హమీద్ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. వ్యాపారానికి సంబంధించిన నగదును ఇంట్లో ఉంచేవాడు. అదే ప్రాంతానికి చెందిన నిందితులు మహమ్మద్ ఉస్మాన్, సయ్యద్ అన్వర్ బాధితుడికి పొరుగువారు కావడంతో అతని ఇంట్లో నగదు ఉంటుందనే విషయం వారికి తెలిసింది. ఈ క్రమంలో మహమ్మద్ ఉస్మాన్ తన స్నేహితుడైన సయ్యద్ అన్వర్‌తో కలిసి ఇంట్లో చోరీ చేయాలని పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 25న బాధితుడు తన పిల్లల వేడుకను ఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించాడు. పొరుగువారైన నిందితులను కూడా కార్యక్రమానికి ఆహ్వానించాడు. వేడుకకు హాజరైన అనంతరం నిందితులు తమ ఇళ్లకు వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో ముందస్తు పథకం ప్రకారం ఇద్దరూ బాధితుడి ఇంటి వద్దకు చేరుకున్నారు. ఇద్దరూ ఇంటిపైకి ఎక్కగా.. సయ్యద్ అన్వర్ ఇంటి పైకప్పుపై ఉండి చుట్టుపక్కల ప్రజల కదలికలను గమనిస్తూ కాపలా కాశాడు. మహమ్మద్ ఉస్మాన్ సుత్తి, స్క్రూడ్రైవర్ సహాయంతో ఇంట్లోకి ప్రవేశించాడు. అనంతరం బెడ్‌రూమ్‌ల తాళాలను పగులగొట్టి, అల్మారాను తెరిచి అందులో ఉన్న రూ.23 లక్షల నగదును అపహరించాడు. అలాగే సుమారు 5 తులాల బరువున్న బంగారు నెక్లెస్, బంగారు చైన్, చెవి దిద్దులను కూడా ఎత్తుకెళ్లాడు. అనంతరం ఇద్దరూ అక్కడి నుంచి పరారయ్యారు.చోరీపై బాధితుడు అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలతో పాటు ఇతర ఆధారాలను సేకరించిన పోలీసులు నిందితుల కదలికలను గుర్తించారు. దర్యాప్తులో నిందితులు బాధితుడికి పొరుగువారేనని, ముందస్తు ప్రణాళికతోనే చోరీకి పాల్పడినట్లు వెల్లడైంది. దీంతో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిలో హసన్‌నగర్‌కు చెందిన మహమ్మద్ ఉస్మాన్ (28) హెయిర్ సెలూన్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మరో నిందితుడు సయ్యద్ అన్వర్ (20) ఆహార సరఫరా సంస్థలో సరఫరా ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ ఒకే ప్రాంతానికి చెందినవారు కావడంతో బాధితుడి ఇంట్లో నగదు ఉన్న విషయం తెలుసుకుని చోరీకి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి రూ.8.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఒక సుత్తి, ఒక స్క్రూడ్రైవర్ స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నగదు, బంగారు ఆభరణాల ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ అరెస్టులు రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ ఐపీఎస్, అదనపు డీసీపీ కె.ఎస్. రావు, రాజేంద్రనగర్ ఏసీపీ టి. శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగాయి. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎ. సీతయ్య, రాజేంద్రనగర్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె. రవి, డీఐ బి. రాజు నాయక్‌తో పాటు పోలీసు సిబ్బంది నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించి, వారి పనితీరును ప్రశంసించారు.

# స్మార్ట్ రేషన్ కార్డులతో పేద కుటుంబాలకు భరోసా

- **ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరో ముందడుగు : మల్‌రెడ్డి రాంరెడ్డి**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిందని తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఎల్బీనగర్‌లోని ఆర్టీసీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మల్‌రెడ్డి రాంరెడ్డితో పాటు గడ్డిఅన్నారం ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2026 ఆగస్టు 15న అధికారికంగా ప్రారంభించారని తెలిపారు. సాంకేతికతను వినియోగిస్తూ రేషన్ సేవలను మరింత సులభతరం, పారదర్శకంగా అందించేందుకు ఈ విధానం దోహదపడుతుందని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు రేషన్ సేవలు సులభంగా అందడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమం, ప్రజల ఆత్మగౌరవం, ప్రతి కుటుంబానికి భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మెగావత్ గణేష్ నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి, మైనారిటీ సీనియర్ నాయకులు జానిమియా, కాంగ్రెస్ నాయకులు షరీఫ్, అజయ్, కాలనీ వాసి పెంటారెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ డిప్యూటీ డీఈఓ ఈరులాల్‌కు ఘన సన్మానం

- **నూతన బాధ్యతలు.. తొలిసారి జిల్లాకు రాక**
- **గిరిజన విద్యాభివృద్ధికి మరింత కృషి చేయాలి**
- **ఈరులాల్‌కు ఆత్మీయంగా అభినందనలు**
- **విద్యా ప్రమాణాల పెంపునకు సమన్వయంతో పనిచేయాలి**
- **అధికారులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సత్కారం**
- **ఏటూరునాగారం విద్యాభివృద్ధికి ఈరులాల్‌కు శుభాకాంక్షలు**



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** ఐటీడీఏ ఏటూరునాగారం డిప్యూటీ డీఈఓగా నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా మహబూబాబాద్ జిల్లాకు విచ్చేసిన బానోత్ ఈరులాల్‌కు ఘన సన్మానం లభించింది. జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ భవనంలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశిరాం నాయక్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఈరులాల్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఐటీడీఏ ఏటూరునాగారం పరిధిలో గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింత కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడం, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడం, విద్యా ప్రమాణాలను పెంపొందించడంలో అధికారుల సమన్వయం కీలకమని పేర్కొన్నారు. తనకు అందించిన ఆత్మీయ సన్మానానికి ఈరులాల్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా రంగ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీఎంఓ, సీఆర్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కన్వీనర్ ధారావత్ బాలాజీ ఆధ్వర్యంలో సీఆర్టీ జిల్లా నాయకులు భూక్య భరత్, విజయ భాస్కర్, విజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కురవిలో 'అక్రమ పట్టాల' కలకలం

- **ఎరుకల కుటుంబంపై దౌర్జన్యాలా..?**
- **కురవిలో భూదందా ఆరోపణలు.. బాధితులపై దౌర్జన్యాలా?!**
- **భూమి పంచాయితీపై భగ్గుమన్న బీఎస్పీ..!**
- **ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు పెట్టాలి**



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** కురవి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 1వ వార్డులో ప్రభుత్వ ఖాళీ స్థలానికి సంబంధించి అక్రమ పట్టా ఆరోపణలు, నివాస గృహాల మధ్య పేలుడు పదార్థాలతో భారీ శబ్దాలు చేయడం, ప్రశ్నించిన బాధితులను కులం పేరుతో దూషిస్తూ దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్న ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని బీఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ డిమాండ్ చేశారు. కురవికి చెందిన బాధితుడు నిమ్మశెట్టి వెంకన్న, ఆయన కుటుంబ సభ్యులు తమపై జరుగుతున్న అన్యాయాన్ని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్‌కు వివరించారు. బాధితులు అందించిన ఆధారాలు, రికార్డులను పరిశీలించిన అనంతరం మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట బాధితులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దార్ల శివరాజ్ మాట్లాడుతూ.. ఎరుకల సామాజిక వర్గానికి చెందిన అమాయకులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న తల్లూరి వీరన్న, తల్లూరి లక్ష్మీనారాయణ, తాళ్లూరి సంతోష్, చిలుముల సంతోష్, చిలుముల శ్రీకాంత్ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులను కులం పేరుతో దూషించి, అవమానించి, దాడులు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన అంశమన్నారు.

**సర్వే నంబర్ 852పై సమగ్ర విచారణ చేయాలి :**

కురవిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 852కు సంబంధించి పూర్వపు లింకు పత్రాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, హక్కులు, స్వాధీనం తదితర అంశాలపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని శివరాజ్ కోరారు. రామక్క ఒకే ఇంటికి ఒకే నంబర్ ఉన్న పరిస్థితుల్లో ఒకే ఇంటి నెంబర్ పై 7 గురికి రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి? సంబంధిత రికార్డులు ఎలా సృష్టించబడ్డాయి? అనే అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూమికి సంబంధించి పట్టా ఎలా మంజూరైంది? దానికి సంబంధించిన రికార్డులు ఏమిటి? అనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

**ఇళ్ల మధ్య పేలుళ్లపై చర్యలు ఏవీ..?**

నివాస గృహాల మధ్య పేలుడు పదార్థాలు ఉపయోగిస్తూ భారీ శబ్దాలు చేయడం వల్ల స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని శివరాజ్ ఆరోపించారు. పేలుడు పదార్థాల వినియోగానికి అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎవరు ఇచ్చారు? నిబంధనలకు అనుగుణంగానే వినియోగిస్తున్నారా? అనే అంశాలపై పోలీసులు, సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. బాధితులపై దాడులు, బెదిరింపులు, కులం పేరుతో దూషణలకు పాల్పడిన వారిపై SC/ST (Prevention of Atrocities) Actతో పాటు వర్తించే ఇతర చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**న్యాయం చేయకుంటే ప్రజా సంఘాలతో ఉద్యమం.**

బాధిత కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు వారి నివాసానికి, ప్రాణాలకు ఎలాంటి ముప్పు లేకుండా పోలీసులు తక్షణ చర్యలు తీసుకోవాలని శివరాజ్ కోరారు. రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయకపోతే మాల మహానాడు, ఎంఆర్పీఎస్, గిరిజన సంఘాలు, ఇతర ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ హెచ్చరించారు.

## ‘బ్రహ్మాస్త్ర2’లో నాయికగా

గత ఏడాది ‘సయారా’ చిత్రం ద్వారా యూత్‌లో మంచి క్రేజ్‌ని సంపాదించుకుంది యువ నాయిక అనీత్ పడ్డా. తాజా సమాచారం ప్రకారం ఈ భామ బాలీవుడ్‌లో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన ‘బ్రహ్మాస్త్ర’ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కబోతున్నది.. ఇందులో ఓ కీలకమైన పాత్ర కోసం మేకర్స్ అనీత్ పడ్డాను సంప్రదించారని బాలీవుడ్ టాక్. అయితే ఈ సినిమాలో ఆమె కథానాయకుడు రణ్‌బీర్‌కపూర్‌కు జోడీగా నటిస్తున్నదా? లేదా ఇతర ప్రధాన పాత్రలో కనిపించనుందా? అనే విషయంలో స్పష్టతలేదు. ‘బ్రహ్మాస్త్ర’ తొలిభాగంలో రణ్‌బీర్‌కపూర్, అలియాభట్, అమితాబ్ బచ్చన్, నాగార్జున కీలక పాత్రల్లో నటించిన విషయం తెలిసిందే. రెండో భాగంలో కథను మరింతగా విస్తరించడంతో కొత్త పాత్రలు, కొత్త నటీనటులు చేరే అవకాశం ఉంది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.